ఒకే పెన్షన్ విధానం కోసం ఉద్యమం

- వికలాంగుల సమస్యల పట్ల కేంద్రం నిర్లక్ష్యం
- జాతీయ మహాసభల్లో పలు సమస్యలపై చర్చిస్తాం
- 12 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు
- ఎన్‌పిఆర్‌డి ప్రధాన కార్యదర్శి మురళీధరన్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా వికలాంగులకు ఒకే పెన్షన్ విధానం కోసం ఉద్యమాలు చేపట్టనున్నట్టు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి బుధవారం వరకు హైదరాబాద్‌లో సంఘం అఖిలభారత మూడో మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభకు 12 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. వికలాంగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. గడిచిన ఎనిమిదేండ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వికలాంగుల హక్కులపై దాడి చేస్తున్నదనీ, కేంద్రం చట్టాలను మార్చేందుకు కుట్ర చేస్తున్నదని విమర్శించారు. వికలాంగుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందనీ, బడ్జెట్ కేటాయింపుల్లో మొండి చెయ్యి చూపిందని విమర్శించారు. అరకొరగా కేటాయించిన నిధుల్లో 35 శాతం కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. యాక్సిసబుల్ ఇండియా, సుగంధ భారత్ అభియాన్, దివ్యాంగ్ వంటి పేర్లతో వికలాంగులను మోసం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించడంలో, వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.300 పెన్షన్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నదని విమర్శించారు. మహిళా వికలాంగులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నా వాటిని అరికట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహాసభల్లో వికలాంగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి, భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య మాట్లాడుతూ. మహాసభ సందర్భంగా సోమవారం ఇందిరా పార్క్ దగ్గర బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి కాంతి గంగులి హాజరవుతున్నారన్నారు. వికలాంగుల సాధికారతపై మంగళవారం జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ కోశాధికారి ఆర్ వెంకటేష్ పాల్గొన్నారు.



కరోనా ఫోర్త్‌వేవ్ పై ఆందోళన వద్దు

- డిహెచ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొవిడ్ ఫోర్త్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని డిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరోనాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి కొవిడ్‌పై పూర్తి స్థాయిలో సమీక్ష జరిపామన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రశాంతంగా ఎవరి పనులు వారు చేసుకోవాలని సూచించారు.కరోనా వ్యాప్తి చెందుతున్నా.. మరణాల శాతం ఉండబోదని, ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపదని డీహెచ్ వివరించారు.

భిన్నత్వంలో ఏకత్వం దేశ ప్రత్యేకత : ఎమ్మెల్సీ ఎల్ రమణ

హైదరాబాద్ : భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత అని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. బేగంపేటలోని కాలినారి హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్స్‌ట్యూట్‌లో క్రిస్మస్, ఆజాదిక అమృత్ మహోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్స్‌ట్యూట్ చెఫ్‌లు, విద్యార్థులు కలిసి 29 రాష్ట్రాల సంప్రదాయ వంటకాలను వండి భారతదేశ పటంపై అందంగా పేర్చారు. సుమారు 600 రకాల వంటకాలను వండి అద్భుతంగా అలంకరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కలినరి ఇన్స్‌ట్యూట్ విద్యార్థులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ అన్ని రాష్ట్రాలకు చెందిన వంటకాలను ఒకే చోట ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు.

పాల ఉత్పత్తిపై చిన్నారులకు అవగాహన

హైదరాబాద్ : ప్రముఖ డి2సి డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ చేవెళ్లలోని తమ ఫార్మ్ వద్ద హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పిఎస్)కు చెందిన 250 మంది విద్యార్థులకు పాల ఉత్పత్తి పట్ల ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. పాల ప్రాసెసింగ్ తదితర ప్రక్రియలు, డెయిరీ ఫార్మింగ్‌లో కీలకాంశాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. మొట్టమొదటిసారిగా డెయిరీ ఫార్మ్‌కు వచ్చిన చిన్నారులు పూర్తి ఉత్సాహం, ఆసక్తితో ఫార్మ్‌లో ఉత్సాహపూరిత వాతావరణం కనిపించిందని సిడ్స్ ఫార్మ్ ఫౌండర్ డాక్టర్ కిశోర్ ఇందుకూరి పేర్కొన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు..

- నందకుమార్ ఇడి విచారణకు కోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుడు నందకుమార్‌ను విచారించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేటు (ఇడి)కి నాంపల్లి కోర్టు అనుమతించింది. ప్రస్తుతం బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ కేసుకు సంబంధించి నందకుమార్ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. కాగా, మొయినాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైనా ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసు ఆధారంగా చేసుకొని ఇడి కూడా విచారణను చేపట్టింది. ఇప్పటికే రెండ్రోజులపాటు తాండూరు బిఆర్ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని ఇడి అధికారులు రెండు రోజులపాటు విచారించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రధాన ఫిర్యాదుదారుగా రోహిత్‌రెడ్డి ఉన్నారు. ఇదే కేసుకు సంబంధించి మూడో నిందితుడిగా ఉన్న నందకుమార్‌ను రెండ్రోజుల పాటు విచారించడానికి నాంపల్లి కోర్టును ఇడి అధికారులు పిటిషన్ వేసి కోరారు. ఇందుకు నాంపల్లి కోర్టు శనివారం అనుమతించింది. దీంతో 26, 27 తేదీల్లో రెండు రోజులపాటు చంచల్‌గూడ జైలులోనే నందకుమార్‌ను విచారించడానికి ఇడి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. కోర్టు ఇచ్చిన అనుమతి పత్రాలను చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు ఇడి అధికారులు అందజేశారు. నందకుమార్‌ను విచారించాక ఈ కేసులో ప్రధాన నిందితుడు రామచంద్ర భారతి, రెండో నిందితుడు సింహయాజి స్వామిలను కూడా ఇడి అధికారులు విచారించనున్నారని తెలిసింది. ఒకపక్క, ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారంటూ బిజెపికి చెందినవారిగా భావిస్తున్న రామచంద్ర భారతి, సింహయాజిస్వామి, నందకుమార్‌లను విచారించిన రాష్ట్ర సిట్ అధికారులు మరోవైపు ఈ కేసులో బిజెపి జాతీయ కార్యదర్శి బిఎల్ సంతోశ్‌ను విచారించడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు. మరోపక్క, ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగించాలంటూ బిజెపితోపాటు ఇతర నిందితులు హైకోర్టును ఆశ్రయించగా.. వాద ప్రతివాదనలు విన్న హైకోర్టు తీర్పును వెలువరించాల్సి ఉంది. అదే సమయంలో తాము కూడా కేసు నమోదు చేసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా రంగంలోకి దిగడంతో ఈ కేసు విచారణ ఎటు నుంచి ఎటు తిరుగుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

ప్రాణాలను బలిగొన్న అతివేగం

- ఇద్దరు పారిశుధ్య కార్మికులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళా పారిశుధ్య కార్మికులు మృతి చెందారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన జిల్లా కేంద్రమైన మెదక్‌లో జరిగింది. ఎస్ఐ మల్లారెడ్డి కథనం ప్రకారం... శనివారం ఉదయం విధులు నిర్వహించడానికి పారిశుధ్య కార్మికులు నర్సమ్మ(53), యాదమ్మ(55), మరియమ్మ మున్సిపల్‌కు వెళ్తున్నారు. మున్సిపల్ సమీపంలోని పెట్రోల్ బంకులో పని చేస్తున్న శాంతమ్మ, జయమ్మ అక్కడ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో వెనకాల నుంచి వేగంగా వచ్చిన కారు ఐదుగురు మహిళలను ఢీకొట్టింది. దాంతో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యాదమ్మ మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం శాంతమ్మ, జయమ్మను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మరియమ్మకు మెదక్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ముందు తోటి కార్మికులు ఆందోళన నిర్వహించారు. కార్మికులకు న్యాయం చేస్తామని పోలీసులు, మున్సిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని వారికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.20 వేలు అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు.

దేశ భవిష్యత్ కమ్యూనిస్టులతోనే సాధ్యం

- బిజెపికి వ్యతిరేకంగా బిఆర్ఎస్‌తో కలిసి పోరాటం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



విలేకరులతో మాట్లాడుతున్న తమ్మినేని

మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా బిఆర్ఎస్‌తో కలిసి పోరాడుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై సిఎం కెసిఆర్ పోరాటాలు చేస్తున్నారని, అందువల్లనే మునుగోడు ఉప ఎన్నికల్లో కలిసి పనిచేశామన్నారు. బిఆర్ఎస్‌తో కలిసి పనిచేసే సందర్భంలో ప్రజా సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదన్నారు. దేశం అభివృద్ధి కావాలంటే అది కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందన్నారు.

కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తుందని తెలిపారు. మండల స్థాయిలో అన్ని రకాల జబ్బులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు కేవలం రూ.236 రోజు కూలి ఇస్తున్నారని, కానీ కేరళ రాష్ట్రంలో రోజు కూలి రూ.830 ఇస్తున్నారని ఇది వాముపక్ష ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని చెప్పారు. కేరళ రాష్ట్రంలో వరి పంటకు మద్దతు ధర ఎకరాకు రూ.24 వేలు ఇస్తున్నారన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు రైతాంగానికి ఈ స్థాయిలో మద్దతు ధర ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దేశంలో బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ఇతర రాజకీయ పార్టీల నేతలను ప్రలోభాలకు గురిచేస్తూ తమ పార్టీలోకి లాక్కుంటుందని విమర్శించారు. బిజెపి విధానాలను ఎండగడుతున్న ఆయా ప్రభుత్వాలపై ఈడీ దాడులకు ఉసిగొలుపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోడు భూముల సమస్యలు, భూ సమస్యలు, ఇండ్ల స్థలాలు, దళితబంధు తదితర సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా డిసెంబర్ 29న జరిగే భారీ బహిరంగసభకు వ్యవసాయ కార్మికులు, ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ గొంతు కోసి హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న మహిళను గుర్తుతెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లా కేంద్రమైన మెదక్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శేట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశం, సుజాత (42) దంపతులు బతుకుదెరువు కోసం మెదక్ పట్టణానికి వలస వచ్చి పెద్దబజారులో నివాసం ఉంటున్నారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సుజాత మార్కెట్ నుంచి ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం 1 గంటలకు భర్త ఆమెకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. దాంతో వెంటనే ఆయనకు అనుమానం వచ్చి ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో ఆమె విగతజీవిగా కనిపించింది. సుజాత గొంతు కోసి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును దుండగులు లాక్కెళ్లారు. వెంటనే భర్త పోలీసులకు సమాచారం అందించాడు. డిఎస్‌పి సైదులు, సిఐ మధు, రూరల్ సిఐ విజయ్‌కుమార్, మెదక్ పట్టణ ఎస్ఐ మల్లారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎస్‌పి రోహిణి ప్రియదర్శిని సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. దుండగులను వెంటనే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.



దేహదారుఢ్య పరీక్షల్లో లోపాలను నివారించాలని నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షల్లో లోపాలను, అవకతవకలను నివారించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ ఈవెంట్లలో జరుగుతున్న లోపాలను సవరించాలని కోరుతూ శనివారం డివైఎఫ్ఐ అధ్వర్యాన హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం లాంగ్‌జంప్ దూరాన్ని 3.8 మీటర్ల నుంచి 4 మీటర్లకు పెంచడంతో అనేక మంది అభ్యర్థులు నష్టపోతున్నారని, ఎత్తు కొలతలను డిజిటల్ పద్ధతి ద్వారా కొలవడంతో సాంకేతిక లోపం వల్ల అభ్యర్థులు అర్హత కోల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రన్నింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు సివిల్, కమ్యూనికేషన్, ఫైర్, జైల్, ఎక్సైజ్ విభాగాల్లో మెయిన్స్‌కు అవకాశం కల్పించాలన్నారు. లాంగ్‌జంప్‌లో ఆన్ ద లైన్ జంప్‌ను అనుమతించాలని కోరారు. డిజిటల్ విధానాన్ని తీసేసి, పాత పద్ధతినే మాన్యువల్‌గా అభ్యర్థుల ఎత్తు కొలతలను తీసుకోవాలన్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం ప్రిలిమ్స్‌లో 7 మార్కులు కలిపి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి.జావెద్, నాయకులు వేణు, శృతి, అజయ్, స్టాలిన్, అభ్యర్థులు జ్యోతి, విజయలక్ష్మి, మమత, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులను సత్కరిస్తున్న కెవి.రమణ

చెడును ఎత్తి చూపడంలో రాజీ వద్దు

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ

ప్రజాశక్తి - కల్చరల్

సమాజంలో మంచి చెడు ఉన్నట్లుగానే ప్రతి వారిలో రెండు గుణాలు ఉంటాయని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ తెలిపారు. మంచికి ప్రాధాన్యత ఇచ్చే వార్తలకు అధిక ప్రచారం పత్రికా విలేకరులు చేయాలని సూచించారు. మాసబ్ ట్యాంక్ వద్దగల డాక్టర్ రమణ నివాస కార్యాలయంలో శ్రీ ఆకాంక్ష చారిటబెల్ ట్రస్ట్ నిర్వహణలో రాబోయే నూతన సంవత్సరం సందర్భంగా పత్రికా విలేకరులకు ఆత్మీయ సత్కారం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ విలేకరులను సత్కరించి మాట్లాడారు. విలేకరులు సమాజంలో జరుగుతున్న చెడును ఎత్తి చూపడంలో రాజీ అక్కరలేదని, అదే సమయంలో కళలు సాహిత్యం వంటి ప్రచారానికి పత్రికలలో వార్తలు విస్తృతంగా వస్తే ఉత్తమ వ్యవస్థ నిర్మాణానికి దోహదం పడుతుందని అన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ సమాజ దిశ నిర్దేశనంలో విలేకరుల పాత్ర విస్మరించలేమని అన్నారు వారిని రాబోయే నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సత్కరించడం వారికి ప్రేరణ ఇస్తుందని అభినందించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మోహన్‌కృష్ణ వ్యాఖ్యానం చేయగా సంస్థ స్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి స్వాగతం పలుకుతూ ఆకాంక్ష సంస్థ చేపట్టిన ప్రతి సేవా కార్యాక్రమానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రచారం చేస్తున్న పత్రికా విలేకరులకు కతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీ భారతి అలపించిన అన్నమయ్య కీర్తన ఆకట్టుకుంది.

బిజెపి విధానం.. ప్రభుత్వ ఆస్తుల అమ్మకం

- కార్పొరేట్లకు, మతోన్మాదులకు తొత్తు
- 'నేషనల్ మానిటైజేషన్ పైపులైన్' పేరుతో దోపిడీ
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఏప్రిల్ 5న ఢిల్లీ ముట్టడి
- సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్లు, మతోన్మాదులకు తొత్తుగా.. ప్రభుత్వ ఆస్తుల అమ్మకమే ధ్యేయంగా బిజెపి పాలన సాగుతోందని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం వేస్తూ.. పెట్టుబడిదారులకు రూ.10 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిందన్నారు. ఖమ్మం నగరంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో ఉన్న మౌలిక వసతులు అన్నింటినీ విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు 'నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్' స్కీం పేరుతో కట్టబెడుతున్నారని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీస్తూ... ప్రతిపక్షాలు, బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలు, చివరకు జర్నలిస్టులపైనా సిబిఐ, ఇడిలతో దాడులు చేయిస్తోందని తెలిపారు. దేశంలో 256 ప్రభుత్వ రంగ సంస్థలు లాభాలతో నడుస్తున్నా.. వాటిని ప్రయివేటీకరించేందుకు పూనుకుందన్నారు. 40 కోట్ల మంది పాలసీదారులు ఉన్న ఎల్‌ఐసిలో లక్ష కోట్ల వాటాలను బిజెపి ప్రభుత్వం అమ్మేసిందన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయ చట్టాలు, లేబర్ కోడ్‌లు, విద్యుత్ చట్టాలు వంటివి దేశప్రయోజనాలకు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు.

ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. జనవరిలో ప్రతి ఇంటికీ వెళ్లి బిజెపి మతోన్మాదం, కార్పొరేట్ విధానాల గురించి వివరిస్తామన్నారు. బిజెపిపై పోరాటం విషయంలో బిఆర్ఎస్ ద్వంద్వ వైఖరి సరికాదని, కేరళను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కోటి మందికిపైగా కార్మికులు పనిచేస్తుండగా ఎనిమిదేండ్లుగా వారికి ఎటువంటి వేతన పెంపుదల లేదన్నారు. వ్యవసాయ కార్మికులు, సన్నా చిన్నకారు రైతాంగం, కౌలు రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు రైతుల పట్టాల విషయంలోనూ జాప్యం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించకుండా బిజెపిపై పోరాటం అర్థం లేనిదన్నారు. ఇవేవీ లేకుండా తెలంగాణ ప్రభుత్వం సమస్యలపై పోరాడుతున్న సంఘాలు, కార్మికులను అణచివేస్తుండటం సరికాదన్నారు. కేంద్రం కూడా రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 29న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు వేలసంఖ్యలో కార్మికులు తరలాల్సిందిగా పిలుపునిచ్చారు.

సెస్ పీఠం దక్కేదెవరికో?

- 15 డైరెక్టర్ స్థానాలకు ముగిసిన పోలింగ్
- 84 శాతం పోలింగ్ నమోదు..



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నెలరోజులుగా వాడీవేడీగా సాగిన సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ (సెస్) ఎన్నికలకు శనివారం ఫుల్‌స్టాప్ పడింది. శనివారం సెస్ పరిధిలోని 15 డైరెక్టర్ స్థానాలకు పోలింగ్ ముగిసింది. ఉదయం 8 గంటలకే ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం వరకూ కొనసాగింది. 13 మండలాల్లోని 15 డైరెక్టర్ స్థానాలకు నిర్వహించిన ఈ పోలింగ్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన 202 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే ముగిసింది. బరిలో 75 మంది అభ్యర్థులు నిలవగా.. 750 మంది ఎన్నికల సిబ్బంది, 15 మంది రూట్ ఆఫీసర్లు, 1100 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సెస్ పీఠం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ ఇప్పుడు సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నెలకొంది. అధికారపార్టీకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అందరూ భావించినప్పటికీ అక్క డక్కడా పార్టీ నేతల్లో అంతర్గత కుమ్ములాటలు ప్రభావం చూపు తాయాయన్న ప్రశ్నత లెత్తుతోంది. దీనికితోడు పెద్దగా బలంలేని విపక్ష పార్టీలుసైతం క్షేత్రస్థాయి లోనే ప్రచారం నిర్వహించాయి.

ఈ క్రమంలో పార్టీలతో సంబంధం లేకుండా ఇతర గుర్తులపై ఎన్నికలు నిర్వహించిన, ఆయా పార్టీలు బలపరిచిన అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బ్యాక్సుల్లో దాగుంది. పోటీ చేసిన స్వతంత్ర్యులు చీల్చే ఓట్లు కూడా ఎవరికి పట్టం కడతాయోనన్న ఆందోళన ఆయా పార్టీ వర్గాల్లో నెలకొంది.

చెదురు మొదురు ఘటనలు

పలు పోలింగ్ కేంద్రాల వద్ద చెదురుమొదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గంభీరావుపేట మండలం నాగంపేట పోలింగ్ కేంద్రం వద్ద అధికార పార్టీ నాయకులు డబ్బులు పంచుతున్నారంటూ బిజెపి శ్రేణులు ఆందోళన చేశాయి. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని పోలింగ్‌బూత్‌లోకి బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పలుమార్లు వస్తూ వెళుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో కొంత ఆందోళన వాతావరణం ఏర్పడింది. జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజి బూత్ వద్ద అధికార పార్టీ కౌన్సిలర్ భర్త బహిరంగా డబ్బులు పంచుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. మొత్తం 15 డైరెక్టర్ స్థానాలకు 87,130 ఓటర్లును అధికారులు గుర్తించారు. 84 శాతం పోలింగ్ నమోదు చేసుకుంది. ఇల్లంతకుంట, వీర్నపల్లి, వేములవాడటౌన్-2 పోలింగ్ కేంద్రాల్లో 90శాతం పోలింగ్ అయింది. అత్యల్పంగా సిరిసిల్ల టౌన్-2లో 76శాతమే నమోదు చేసుకుంది.

మార్పు అనివార్యం

- ప్రముఖ సాహితీవేత్త చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

నిన్నటి నుంచి నేటికి.. నేటి నుంచి రేపటికి మార్పు అనివార్యమని.. అది సమాజ అభ్యున్నతి దిశగా సాగితే వ్యవస్థల పనితీరు బాగుంటుందని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో జరుగుతున్న 35వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో భాగంగా శనివారం అలిశెట్టి ప్రభాకర్ వేదికపై నారపరాజు కిషోర్ కుమార్ రచించిన మార్పు 1, మార్పు 2 నవలలు ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా చంద్రశేఖరరెడ్డి పాల్గొని సంపుటిలను ఆవిష్కరించి మాట్లాడారు. అక్షర ప్రేమికులకు పుస్తక ప్రదర్శన వేదికని, చదివి బాగుపడని వారు ఉండరని అన్నారు. సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ గ్రామ వికాసం నేపథ్యంలో మార్పు నవలలు కిషోర్ కుమార్ రాశారని, తెలంగాణ ప్రాంతంలోని 12 వేల 769 గ్రామాల చరిత్రను విద్యార్థులతో గ్రంథస్తం చేయిస్తున్నామని తెలిపారు. కవి, రచయిత ఆనందాచారి మాట్లాడుతూ అక్షరాన్ని నిషేధిస్తూ గ్రంథాలపై ఆంక్షలు విధిస్తున్న సమయంలో కిషోర్ అక్షరాలను భుజంపై వేసుకోవడమంటే సమాజాన్ని ఎత్తుకోవడమేనని అన్నారు. గ్రామం సుసంపన్నం కావడం కోసం విద్య వైద్యం కావాలని కలలుకన్న కిరణ్ తన నవలలో గ్రామం స్వయం సమృద్ధి అయ్యే మార్గం చూపారని అన్నారు. రచయిత్రి శిలా లలిత మాట్లాడుతూ మానవ సంబంధాలను నవాలలో హృద్యంగా చిత్రించారని అభినందించారు. కవి చక్రవర్తి అధ్యక్షత వహించి రచయిత కిషోర్‌ను పరిచయం చేశారు. చంద్రమోహన్ వందన సమర్పణ చేశారు.



నడిరోడ్డుపైనే మహిళ ప్రసవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో రోడ్డుపైనే ఓ మహిళ ప్రసవించింది. మహారాష్ట్రకు చెందిన నిండు గర్భిణి బబిత ఇస్నాపూర్‌లో నివాసముంటోంది. శనివారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళ్తుండగా పురిటి నొప్పులు రావడంతో రామచంద్రాపురం అశోక్‌నగర్ కూడలి వద్ద రోదిస్తూ రోడ్డుపైనే కూర్చుండిపోయింది. పురిటి నొప్పులతో విలవిల్లాడుతున్న ఆమెను గమనించిన స్థానికులు సమీపంలో ఉన్న దుకాణాల నుంచి అట్టముక్కలు తెచ్చి అడ్డుగా పెట్టారు. కాసేపటికి ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆమెను ఆటోలో పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

క్లాట్ 2023 ఫలితాల్లో 'శ్రీచైతన్య' ప్రభంజనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ లా యూనివర్సిటీల్లో ఐదేళ్ల లా కోర్సు ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్-2023 ఫలితాల్లో శ్రీ చైతన్య ఐఎఎస్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అత్యధిక స్థాయిలో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. వివిధ కేటగిరీల్లో ఆర్ జోషిత 28వ ర్యాంకు, పి.జ్యోతి 132వ ర్యాంకు, భూక్యా కార్తీక్ 155వ ర్యాంకు, బి.చంద్రశేఖర్ 199వ ర్యాంకు, కె.రాహుల్ 252వ ర్యాంకు, వి వెన్నెల 363వ ర్యాంకులతోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటి లెర్న్ కో ఫౌండర్ సుష్మ తెలిపారు. క్లాట్ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బందికి శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బిఎస్ రావు అభినందనలు తెలిపారు.



ఎల్‌ఎండి నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాసంగి పంట సాగు కోసం కరీంనగర్‌లోని ఎల్‌ఎండి రిజర్వాయర్ నుంచి నీటిని శనివారం ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల ఇఎన్‌సి బి.శంకర్ మాట్లాడుతూ.. రైతుల అవసరాల నిమిత్తం క్రమక్రమంగా నీటి విడుదల 500 క్యూసెక్కుల నుంచి 4 వేల క్యూసెక్కుల వరకు పెంచుతామని తెలిపారు. ఈ నీటి విడుదల ఏప్రిల్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ విద్యాసంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం తప్పదని శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ మంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

డిఎడ్‌తో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకూ అవకాశమివ్వాలి

- డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టులకు డిఎడ్‌తో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిఎడ్‌తో డిగ్రీ పూర్తి చేసిన వారు లక్ష మంది వరకు అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. 2011 జూన్ 28న జారీ చేసిన జిఓ నెంబర్ 45 ద్వారా 2018లో గిరిజన సంక్షేమ శాఖలో వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టులకు బిఎడ్‌తోపాటు డిఎడ్‌తో డిగ్రీ పూర్తి చేసిన వారికి అవకాశమిచ్చారని గుర్తు చేశారు. నాలుగు నెలల క్రితం ఎపిలో ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్‌లోనూ వారికి అవకాశం కల్పించారని తెలిపారు. కానీ శుక్రవారం టిఎస్‌పిఎస్‌సి జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆ పోస్టులకు 45 జిఓ ప్రకారం కేవలం బిఎడ్ అభ్యర్థులే అర్హులని ప్రకటించిందని పేర్కొన్నారు. దీనివల్ల లక్ష మంది అభ్యర్థులు ఆ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎడ్‌తో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్రం వివక్షపై కలిసి పోరాడుదాం

- పదోన్నతులు, బదిలీలపై సిఎం సానుకూలం
- విద్యాశాఖలో ఖాళీలన్నీ త్వరలో భర్తీ
- ఎస్‌టియుటిఎస్ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు
- న్యాయపరమైన సమస్యల్లేకుండా ప్రమోషన్లు : సబిత



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణపై వివక్షతను ప్రదర్శిస్తోందని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. కేంద్రం తీరుకు వ్యతిరేకంగా కలిసి పోరాడుదామని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి, విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బదిలీలు, పదోన్నతులపై ముఖ్యమంత్రి కెసిఆర్ సానుకూలంగా ఉన్నారని వివరించారు. రెండురోజులపాటు నిర్వహించనున్న రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియుటిఎస్) వజ్రోత్సవ వేడుకలు శనివారం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న ఎంఇ రెడ్డి గార్డెన్‌లో ప్రారంభమయ్యాయి. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభకు మంత్రులు టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎ ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే డి సుధీర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, ఎస్‌టియుటిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు, నాయకులు బ్రహ్మచారి, బి నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బి రవి, కరుణాకర్‌రెడ్డి, టి పోల్‌రెడ్డి, ఎవి సుధాకర్, దాసరి శ్రీధర్, ఎల్‌ఎం ప్రసాద్, ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఒకటో తేదీన జీతాలు రావడం లేదంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆలోచిస్తున్నారని చెప్పారు. 'డబ్బులుండి ఇస్తలేమా?. కావాలని ఆపుతామా.. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరేడేండ్లు ఒకటో తేదీన జీతాలిచ్చింది.. ఏడాది కాలంగా ఇబ్బంది వస్తున్నది... కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నది... 2.50 లక్షల కోట్ల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది... ఎఫ్‌ఆర్‌బిఎం చట్టప్రకారం రూ.15 వేల కోట్లు కోత పెట్టింది. బోరు మోటార్లకు మీటర్లు పెట్టలేదంటూ రూ.12 వేల కోట్ల నిధులివ్వడం లేదు.. 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసినా రూ.5,300 కోట్లు చెల్లించడం లేదు. జిఎస్‌టి బకాయిలివ్వడం లేదు. ఇలా రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన రూ.40 వేల కోట్ల నిధులను ఆపేసింది. కేంద్రం నిధులు ఆపడం వల్లే జీతాల చెల్లింపులో ఆలస్యమవుతున్నది. వీలైనంత త్వరగా జీతాల సమస్యను పరిష్కరిస్తాం. దేశంలో అతి ఎక్కువ వేతనాలు పొందుతున్నది తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులే' అని హరీశ్‌రావు అన్నారు. ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల విషయంలో సిఎం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కెజిబివి, భాషాపండితుల సమస్యను ఎజితో మాట్లాడి పదోన్నతులు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని వివరించారు. విద్యాశాఖలోని ఖాళీలన్నింటినీ త్వరలోనే భర్తీ చేస్తామన్నారు.

'గురువు లేనిదే విద్య లేదు. విద్య లేనిదే జ్ఞానం లేదు. జ్ఞానం లేకపోతే ఈ లోకంలో మనుగడ ఉండనే ఉండదు' అని హరీశ్‌రావు అన్నారు. ప్రతి మనిషి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువు క్రియాశీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. మార్కులు, ర్యాంకులే కాకుండా.. ఉన్నత విలువలు నేర్పించేలా విద్యాబోధన సాగాల్సిన అవసరముందన్నారు. మంచి విద్యతోపాటు విలువలు, బాధ్యత కలిగిన విద్యార్థులను సమాజానికి అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కేంద్రం మోడల్ స్కూళ్లను రద్దు చేస్తే వాటిని కొనసాగించామని చెప్పారు. అంగన్‌వాడీల బడ్జెట్‌ను కేంద్రం తగ్గిస్తే వాటి ప్రమాణాలను పెంచి బలోపేతం చేసుకుంటున్నామని వివరించారు. గురుకుల విద్యాసంస్థలను 298 నుంచి 1201కి పెంచుకున్నామని చెప్పారు. గురుకులాల్లో డిగ్రీ, పీజీ, లా కాలేజీ ఉందని అన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. అటవీ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు అన్ని రాష్ట్రాలూ, కేంద్రానికి ఆదర్శమని చెప్పారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు వంటి పథకాలను కేంద్రం వేరే పేర్లతో అమలు చేస్తున్నదని వివరించారు.

చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరిస్తాం : సబిత

న్యాయపరమైన సమస్యల్లేకుండా పదోన్నతులు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఆలోచన అని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సమస్యలను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం పెట్టుకోవడం రాజ్యాంగ హక్కని చెప్పారు. విద్యాపునాది సరిగ్గా లేకపోతే భవిష్యత్తు అంధకారంగా ఉంటుందన్నారు. రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర విద్యావిధానాన్ని కేంద్రం రూపొందిస్తే బాగుండేదని తెలిపారు. మార్కులు, ర్యాంకుల కోసం కాకుండా మానవీయ విలువలు నేర్పించాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సమాజానికి చోదకశక్తిగా ఉపాధ్యాయులుండాలని ఆకాంక్షించారు. ప్రశ్నించే గొంతును కేంద్రం నులివేస్తున్నదని చెప్పారు. ప్రశ్నించేతత్వాన్ని చంపేస్తున్న వారిని నిలదీయాలని పిలుపునిచ్చారు. వజ్రోత్సవ ప్రత్యేక సంచిక వజ్రోద్యమంను మంత్రి హరీశ్‌రావు, డైరీని సబితా ఇంద్రారెడ్డి, జాతిరత్నాలు ప్రత్యేక పుస్తకాన్ని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి

- 29న ఖమ్మంకు రైతులు, కూలీలు తరలి రావాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం దివాళా తీస్తోందని, రైతులు, కార్మికుల ఐక్యంగా పోరాడి ఆ రంగాన్ని కాపాడుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. డిసెంబర్ 29న ఖమ్మంలో జరుగుతున్న వ్యకాస బహిరంగ సభను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లెనపాడు, గన్నవరం గ్రామాల్లో తమ్మినేని విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. దేశానికి కేరళ తరహా విధానాలు అవసరమని తెలిపారు. దేశంలో ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న బిజెపి తీరును వివరించారు. బిజెపి ముప్పు నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి కలిసి వచ్చే శక్తులతో భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామని, రైతులు, కూలీలు అందరూ కమ్యూనిస్టుల పోరాటాలను బలపరచాలని కోరారు. ప్రజానుకూలంగా పరిపాలన అందిస్తున్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 29న ఖమ్మం బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి రావాలని కోరారు. ఈ సభకు గొల్లెనపాడు, గన్నవరం గ్రామాల శాఖల కార్యదర్శులు అమరనేని వెంకటేశ్వరరావు, శీలం వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, వైరా విశాల సహకార పరపతి సంఘం వైస్ చైర్మన్ కొణిదన కోటేశ్వరరావు, గన్నవరం సర్పంచ్ వేమిరెడ్డి విజయలక్ష్మి, అష్టగుర్తి ఎంపిటిసి కిలారు లక్ష్మి, సీనియర్ నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, మండల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన దూరం.. పెరిగిన అనుసంధానం

- లింక్ రోడ్లతో వాహనదారులకు మేలు
- సిఎం కెసిఆర్ ఆదేశాలతో మెరుగైన రవాణాకు పురపాలక శాఖ చర్యలు
- హైదరాబాద్, శివారు మున్సిపాల్టీల్లో ప్రత్యామ్నాయ ప్రగతి మార్గాలుగా లింక్ రోడ్లు
- రోడ్ల అనుసంధానం కోసం హెచ్‌ఆర్‌డిసిఎల్ ఏర్పాటు
- రూ.572కోట్లతో 37 లింకు రోడ్లు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఎస్‌ఆర్‌డిపిలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు కారిడార్లను నిర్మించిన రాష్ట్ర ప్రభుత్వం.. దూరం తగ్గించడానికి లింకు రోడ్లను సైతం నిర్మించింది. జిహెచ్‌ఎంసి, శివారు ప్రాంతాల్లోని మున్సిపాల్టీలను అనుసంధానం చేయడానికి అవకాశం ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం కంపెనీల చట్టం ప్రకారం హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌ఆర్‌డిసిఎల్) పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్‌ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నగరంలోని మిస్సింగ్ లింక్ కారిడార్లు, స్లిప్ రోడ్‌లను గుర్తించి అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఆదేశించారు.ఇవి భవిష్యత్ అభివృద్ధి రంగాలకు వెన్నెముకగా మారతాయి. రవాణా నెట్‌వర్క్‌ను మెరుగుపరచి, పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ సమస్యలను తగ్గించడంతోపాటు ప్రయాణ సమయాన్ని ఆదా చేసే ప్రత్యామ్నాయ మార్గాలుగా లింక్ రోడ్లను నిర్మించాలని నిర్దేశించారు. ఆయా ప్రాంతాల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడానికి అధ్యయనం చేసిన తర్వాతనే ఈ లింక్, స్లిప్ రోడ్లను ప్రభుత్వం చేపట్టింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలనూ దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల ప్రజలకు సులభతర రవాణా సదుపాయం కల్పిస్తోంది. ప్రధాన కారిడార్‌లపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే ఈ లింక్ రోడ్ల నిర్మాణ ఉద్దేశం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని మొత్తం 126.20 కిలోమీటర్ల పొడవు కలిగిన 135 లింక్ రోడ్లను ప్రభుత్వం ఖరారు చేసింది. అందులో భాగంగా రూ.572 కోట్ల 17 లక్షలతో 52.36 కిలోమీటర్లు చేపట్టిన 37 పనుల్లో.. రూ.273 కోట్ల 61 లక్షలు విలువైన 24 కిలోమీటర్ల పొడవైన 21 పనులు పూర్తయ్యాయి. ఈ లింక్, స్లిప్ రోడ్‌లు వినియోగంలోకి వచ్చాయి. మరో 28.36 కిలోమీటర్లు పొడవున్న రూ.298.56 కోట్ల విలువైన 16 పనులు పురోగతిలో ఉన్నాయి. పూర్తయిన లింక్ రోడ్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరో 104 రోడ్లు జిహెచ్‌ఎంసి, చుట్టుపక్కల 10 మునిపాల్టీల్లోని ప్రాంతాలను అనుసంధానం చేయడానికి రూ.2410కోట్ల అంచనాతో 104 లింక్ రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిహెచ్‌ఎంసిలో 95.47 కిలోమీటర్ల పొడవున మొత్తం రూ.1160 కోట్లతో 72 లింక్ రోడ్ల నిర్మాణం, శివారు ప్రాంతాల్లోని పది మున్సిపాల్టీల్లో రూ.1250కోట్లతో 103.45 కిలోమీటర్ల లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టారు.

మున్సిపాల్టీల్లో..

బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట్, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లు, ఫట్యేసర్, కొత్తూరు, దమ్మాయిగూడ, నాగారం, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, మణికొండ మున్సిపాల్టీల్లో లింకు రోడ్ల నిర్మాణం చేపట్టారు. హెచ్‌ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో నిర్మించిన లింక్ రోడ్ల ద్వారా అనుసంధానం చేయబడిన ప్రాంతాలు ఇలా ఉన్నాయి.

- ఖాజాగూడ సరస్సు పొడవునా 26-లింక్ రోడ్డు పొడవు 1.40 కిలోమీటర్లు రూ.31.12 కోట్లతో చేపట్టారు.
- లింక్ రోడ్డు రోడ్ నెం.45 నుంచి లెదర్‌పార్క్, ఓల్డ్ బొంబాయి హైవే వరకు పొడవు 1.20 కిలోమీటర్లు రూ.21.69 కోట్లతో చేపట్టారు.
- పాత బాంబే హైవే (లెదర్‌పార్క్) నుంచి రోడ్ నెం.45 వరకు నందిహిల్స్ వద్ద 0.35 కి.మీ పొడవున రూ.30.30కోట్లతో హెచ్‌టీ లైన్ కింద వెహికిల్ అండర్‌పాస్(వీయూపీ) నిర్మాణం చేపట్టారు.
- ఐఎస్‌బీ రోడ్డు నుండి ల్యాంకోహిల్స్ జంక్షన్ వరకు లింక్ రోడ్డులో కొంత భాగం పొడవు 1.94 కిలోమీటర్లు రూ.17కోట్లతో నిర్మించారు.
- నిజాంపేట్ ఎక్స్ రోడ్ల నుంచి హైటెక్స్ జంక్షన్ వరకు లింక్ రోడ్డు పొడవు 0.75 కిలోమీటర్లకు రూ.6.41 కోట్లు ఖర్చు చేశారు.
- మియాపూర్ మెట్రో డిపో నుంచి కొండాపూర్ వరకు రూ.2.87కోట్లతో చేపట్టారు.
- నోవాటెల్ నుంచి ఆర్‌టీఏ ఆఫీస్ వరకు లింక్ రోడ్డు, వ్యయం రూ 5.58 కోట్లు.
- చిత్రపురిహిల్స్ మీదుగా ఖాజాగూడ రోడ్డుకు పాత బాంబే హైవే పొడవు 950 మీటర్లకు రూ.15.07 కోట్లు.
- ఖాజాగూడ సరస్సు నుంచి అవుటర్‌రింగ్ రోడ్డు వరకు ఉర్దూ యూనివర్సిటీ కాంపౌండ్‌వాల్‌కి సమాంతరంగా కిలోమీటర్ పొడవు, వ్యయం రూ.47.66 కోట్లు.
- సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు నుంచి పీర్జాదిగూడ రోడ్డు పొడవు 2.60 కిలోమీటర్లను రూ.25.60 కోట్లతో చేపట్టారు. 4.74 కిలోమీటర్ల మొత్తం ఖర్చు రూ.34.23 కోట్లు అయింది. పైకారిడార్‌లతోపాటు 12.66 కిలోమీటర్ల పొడవైన 11 ఇతర మిస్సింగ్ లింక్ కారిడార్‌లను మొత్తం రూ.108.93 కోట్లతో హెచ్‌ఆర్‌డీసీఎల్ నిర్మించింది.

జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ ఇవ్వండి

- సిఎం కెసిఆర్‌కు కూనంనేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ బార్ అసోసియేషన్‌లో ఐదు నుంచి పదేండ్ల సర్వీస్ ఉన్న జూనియర్/యువ న్యాయవాదులకు స్టైఫండ్, ఆరోగ్యకార్డులను మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర ఏర్పాటు కోసం న్యాయవాదులు తమ వంతు పోరాటాలు నిర్వహించారని తెలిపారు. న్యాయ కళాశాలల నుంచి కొత్తగా వచ్చిన జూనియర్ న్యాయవాదులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారు జూనియర్లు కాబట్టి కొత్తగా కేసులు వారికి రావని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాదుల దగ్గర కొన్నేండ్లపాటు పని చేయాల్సి ఉంటుందని వివరించారు. కోవిడ్ పరిస్థితుల్లో కోర్టులు మూతపడి కేసుల్లేక జూనియర్ న్యాయవాదులకు మనుగడ లేకపోవడంతో ఇతర వనరులపై ఆధారపడాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, కొన్ని ఇతర రాష్ట్రాలు జూనియర్ న్యాయవాదుల దుస్థితిని గమనించి ఐదేండ్ల సర్వీసు కలిగిన జూనియర్ న్యాయవాదులకు సగటున రూ.ఐదు వేలు నెలకు స్టైఫండ్‌ను మంజూరు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోనూ జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్, ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్ భగవత్

పెరిగిన సైబర్ క్రైమ్

- సిపి మహేష్ భగవత్ వెల్లడి
- 2022 సంవత్సరపు వార్షిక నేర నివేదిక విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాది కంటే ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగిందని సిపి, అడిషనల్ డిజి మహేష్ మురళీధర్ భగవత్ తెలిపారు. తన సర్వీస్‌లో ఒక్క కమిషనరేట్‌లో ఇన్ని సంవత్సరాలు విధులు నిర్వహిస్తానని అనుకోలేదన్నారు. ఈ ప్రభుత్వంలో సుమారు ఏడు సంవత్సరాలు చేశానని, ప్రతి రోజూ నూతన పద్ధతిలో, ప్రతి కేసుకూ ప్రాధాన్యత ఇవ్వడం వలనే విజయవంతమయ్యానని చెప్పారు. హైదరాబాద్ నాగోల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2022 సంవత్సరపు వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. అనంతరం సిపి మాట్లాడుతూ.. 2021తో పోలిస్తే ఈ ఏడాది 19 శాతం నేరాలు పెరిగాయని తెలిపారు. అయితే, హత్యలు 29 శాతం తగ్గాయని చెప్పారు. కిడ్నాప్‌లు 38 శాతం, లైంగికదాడులు 1.33 శాతం, వరకట్న మరణాలు 5.88 శాతం, నరహత్య కేసులు 50 శాతం, ఆత్మహత్యకు ప్రేరేపించడం 84 శాతం, మహిళల హత్య కేసులు 63 శాతం, బలహీన వర్గాలపై నేరాలు రెండు శాతం తగ్గాయన్నారు. అటెన్షన్ డైవర్షన్ కేసులు కూడా 11.67 శాతం తగ్గాయని చెప్పారు. ఇక చీటింగ్ కేసులు 3 శాతం, మహిళలపై నేరాలు 17 శాతం, ఆస్తి నేరాలు 23 శాతం పెరిగాయని తెలిపారు. చోరీలకు సంబంధించి రికవరీ రేటు 57 శాతం నుంచి 63 శాతానికి పెరిగిందని తెలిపారు. ఎన్‌డిపిఎస్ కేసులు 140 శాతం, గేమింగ్ యాక్ట్ కేసులు 17 శాతం పెరగగా.. పీఐటీపే కేసులు 3 శాతం, గుట్కా కేసులు 131 శాతం తగ్గాయని వెల్లడించారు. సైబర్ క్రైమ్ కేసులు 66 శాతం పెరిగాయని, రోడ్డు ప్రమాద కేసులు 19 శాతం, ప్రాణాంతక ప్రమాదాలు 0.16 శాతం పెరిగాయని తెలిపారు. ప్రమాదాల్లో మరణాలు 0.91 శాతం, ఓఆర్‌ఆర్‌పై ప్రాణాంతక ప్రమాదాలు 7.69 శాతం తగ్గాయన్నారు. ఓఆర్‌ఆర్‌పై జరిగిన ప్రమాదాల్లో మరణాలు 31.58 శాతం తగ్గాయని వివరించారు. తన సర్వీస్‌లో అత్యధిక కాలం రాచకొండ కమిషనరేట్‌లో పని చేయడం చాలా ఆనందంగా ఉందని సిపి అన్నారు. తమ సిబ్బంది ప్రతి విభాగంలోనూ అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నేరస్థులకు అత్యధికంగా శిక్షలు విధించింది రాచకొండ కమిషనరేట్‌లో మాత్రమే అని చెప్పారు. తెలంగాణ పోలీస్ శాఖలో ఆత్యాధునిక టెక్నాలజీ రావడంతో దొంగలు సైతం తమ రూటు మార్చి సైబర్ నేరాలకు పాల్పడి సులభంగా నగదు కాజేస్తున్నారని చెప్పారు. యువత ఎక్కువగా ఆశలకు పోయి స్మార్ట్ ఫోన్‌ల ద్వారా నగదు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రాచకొండలో ఉన్న 3 జోన్‌ల డీసీపీలు, ఏసీపీలు, 56 పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

బుర్రా లాస్యకు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఐసిసి అకాడమీ కోచ్ ఎడ్యుకేషన్ కోర్సులో లెవల్ వన్ సర్టిఫికెట్ సాధించిన బుర్రా లాస్యను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కలిసిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ ప్రత్యేక విజన్‌తో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్రామీణ క్రీడాకారులను తయారు చేయడం కోసం సుమారు 8500 గ్రామీణ క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం గర్వించే విధంగా మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

'రస్నా హెల్తీ డే' ఉత్పత్తుల ఆవిష్కరణ



హైదరాబాద్ : పానియాల తయారీ సంస్థ రస్నా కొత్తగా 'రస్నా హెల్తీ డే' పేరుతో కొత్త ఉత్పత్తులను ఆవిష్కరిం చినట్లు ప్రకటించింది. ఈ ఉత్పాదనలను నటులు మందిరాబేడి, సొనాలి బింద్రే ఆవిష్కరించారని పేర్కొంది. వంద శాతం ప్రకృతి సిద్ధమైన, స్వచ్ఛమైన హనీ, సూపర్ హెల్తీ వెజ్జీ ఓవర్ లోడ్ క్విక్కీ సూప్, ఛాకో స్ప్రెడ్, ప్రొటీన్ విటా లాంటి నాలుగు ఉత్పత్తును కొత్తగా అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.

ఎన్‌డిటివి పూర్తిగా అదానీ పరం..!

న్యూఢిల్లీ : ప్రజానుకూల చానల్‌గా గుర్తింపు పొందిన ఎన్‌డిటివి పూర్తిగా కార్పొరేట్ అధినేత గౌతం అదానీ పరం అయ్యింది. ఎన్‌డిటివి వ్యవస్థాపకులు ప్రణయ్ రాయ్, రాధికరాయ్‌లు సంస్థలోని తమ షేర్లలో అత్యధిక వాటాలను అదానీకి విక్రయించనున్నట్లు రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చారు. ఎన్‌డిటివిలో వారికి ప్రస్తుతం 37.44 శాతం వాటా ఉండగా.. ఇందులో 32.26 శాతం వాటాను అదానీకి అమ్మేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆ చానల్‌లో వారికి 5 శాతం వాటా మిగలనుంది. తొలుత ఈ సంస్థలోని మెజారిటీ వాటాలను దొడ్డిదారిన అదానీ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆ సంస్థలోని వాటాదారులు, ఇన్వెస్టర్లపై ఒత్తిడి పెంచి క్రమంగా వాటాలను పెంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

టాటా సంస్థకు డిటిసి భారీ ఆర్డర్



న్యూఢిల్లీ : వాణిజ్య వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ అనుబంధ సంస్థ అయినా టిఎంఎల్ సివి మొబిలిటీకి ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డిటిసి) 1500 ఇవి బస్‌ల ఆర్డర్‌ను ఇచ్చింది. దీనిపై ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీటిని సరఫరా చేయడంతో పాటుగా 12 ఏళ్ల పాటు మెయింటనెన్స్ కూడా చేయనుంది. ఇది తమకు అతిపెద్ద ఆర్డర్ అని టిఎంఎల్ సివి మొబిలిటీ ఛైర్మన్ అసీమ్ కుమార్ తెలిపారు.